


# కెరటం న్యూస్

(సామాన్యుడి ఆయుధం)




Published from.. Hyderabad, Khammam, Warangal, Nalgonda

సంపుటి : 04 సంచిక : 221 | బుధవారం 13- ఆగష్టు 2025 | ఎడిటర్ : వనం నాగయ్య | పేజీలు : 4 ఫోన్ : 9441877695

## సీబీఐ చేతికి అడ్వకేట్ వామనరావు దంపతుల మర్డర్ కేసు



**న్యూస్ డెస్క్, 12 ఆగష్టు (కెరటం న్యూస్):** అడ్వకేట్ వామనరావు దంపతుల మర్డర్ కేసులో సంచలన పరిణామం చోటు చేసుకుంది. వామనరావు దంపతుల హత్య కేసును సుప్రీంకోర్టు కేంద్ర దర్యాప్తు సంస్థ సీబీఐకి అప్పగించింది. ఈ మేరకు కేసును సీబీఐకి ట్రాన్స్‌ఫర్ చేస్తూ దేశ అత్యున్నత న్యాయస్థానం ఆదేశాలు జారీ చేసింది.

## అమెరికాలో రోడ్డు ప్రమాదం.. హైదరాబాద్ విద్యార్థిని మృతి



**న్యూస్ డెస్క్, 12 ఆగష్టు (కెరటం న్యూస్):** అమెరికాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో హైదరాబాద్‌కు చెందిన విద్యార్థిని మృతి చెందింది. బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. సిద్దిపేట జిల్లా రామారుకల గ్రామానికి చెందిన శ్రీనివాస్ వర్మ, హేమలత దంపతులకు శ్రీజా వర్మ, శ్రేయా వర్మ అనే ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

# మా శాఖ కాదు..

# మా పరిధి కాదు అంటే ఊరుకోను

- భారీ వర్షాలపై అప్రమత్తంగా ఉండాలి
- అధికారులు సెలవుల్లేకుండా 24x7 విధుల్లో ఉండాలి
- హైదరాబాద్ సహా పలు జిల్లాల్లో భారీ వర్షాలకు సిద్ధంగా ఉండాలి
- విపత్తు నివారణ నిధులకు కొరత లేదు... తక్షణ చర్యలు తీసుకోండి - కలెక్టర్లకు స్పష్టమైన ఆదేశాలు
- ఇంకా వర్షం పడకముందే ప్రణాళిక సిద్ధం... డ్రైనేజ్, విద్యుత్, హెల్త్ శాఖలు అప్రమత్తం కావాలి
- మూడు రోజులు కీలకం... ప్రజలకు అవసరమైతే ఇంటి నుంచే పని సూచించండి - ఐటీ కంపెనీలకు సూచన
- ఎయిర్ లిఫ్టింగ్‌కి హెలికాప్టర్లు సిద్ధంగా ఉంచండి... లోతట్టు ప్రాంతాలపై ప్రత్యేక నిఘా



**న్యూస్ డెస్క్, 12 ఆగష్టు (కెరటం న్యూస్):** రానున్న మూడు రోజులు తెలంగాణలో భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ సూచనల నేపథ్యంలో అధికార యంత్రాంగం సర్వసన్నద్ధంగా ఉండాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. హైదరాబాద్‌తో పాటు భారీ వర్షాలు, వరద ప్రభావం ఎక్కువగా ఉండే జిల్లాల్లో ఆస్తి, ప్రాణ నష్టం జరక్కుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఉన్నతాధికారులు, జిల్లాల కలెక్టర్లను ఆదేశించారు. రానున్న 72 గంటల్లో పలు జిల్లాలతో పాటు హైదరాబాద్‌లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ సూచనల నేపథ్యంలో కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి ఉన్నతాధికారులు, జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి అప్రమత్తం చేశారు. రానున్న పరిస్థితులను ఎదుర్కొనడానికి తీసుకోవలసిన చర్యలపై అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

రాబోయే మూడు రోజులు కీలకంగా మారినందున అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది సెలవులను రద్దు చేయాలి. 24 గంటలు అందుబాటులో ఉండాలి. ఎక్కడా ప్రాణ, ఆస్తి నష్టం జరకుండా, పశు సంపదకు నష్టం జరక్కుండా చర్యలు తీసుకోవాలి. 24 గంటల్లో 2 సెం.మీ వర్షాన్ని తట్టుకునే విధంగా పట్టణాలు నిర్మితమై ఉన్నాయి. అలాంటిది క్లౌడ్ బరస్ట్ సమయాల్లో అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు అందరూ సన్నద్ధంగా ఉండాలి. గతంలో 2 గంటల్లో 42 సెం.మీ వర్షం పడటంతో నష్టం జరిగింది. విపత్తు నివారణ నిధులను వినియోగించుకోవాలి. నిధులకు కొరత లేదు.

## బీసీ గర్జన సభను మరోసారి వాయిదా వేసిన బీఆర్ఎస్



**న్యూస్ డెస్క్, 12 ఆగష్టు (కెరటం న్యూస్):** స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అమలుకు ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలనే ఉద్దేశ్యంతో బీఆర్ఎస్ పార్టీ కథన భేరి పేరిట నిర్వహించ తలపెట్టిన బీసీ గర్జన సభను మరోసారి వాయిదా వేసింది. భారీ వర్ష సూచన నేపథ్యంలో కరీంనగర్ వేదికగా నిర్వహించ తలపెట్టిన ఈ భారీ బహిరంగ సభను వాయిదా వేస్తున్నట్లు ప్రకటించింది. ఈ మేరకు కరీంనగర్ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ పార్టీ నేత గంగుల కమలాకర్.. తన ఎక్స్ ఖాతా వేదికగా ఈ ప్రకటన చేశారు. భారీ వర్ష సూచన కారణంగానే ఈ సభను వాయిదా వేసినట్లు ఆయన తెలిపారు.

## కోడి గుడ్ల కుంభకోణం రూ. 600 కోట్లు

**: ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్**



**న్యూస్ డెస్క్, 12 ఆగష్టు (కెరటం న్యూస్):** కాంగ్రెస్ పార్టీ అంటేనే కుంభకోణాల పార్టీ, కమీషన్ల పార్టీ అని బీఆర్ఎస్ సీనియర్ నేత ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. తాజాగా కాంగ్రెస్ ప్రభుత్వం తెచ్చిన జీవో 17పై ఆయన మండిపడ్డారు. తెలంగాణ భవన్‌లో ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ గురుకులాలు, వివిధ స్కూళ్ల ఫుడ్ కాంట్రాక్టర్లతో కలిసి మీడియాతో మాట్లాడారు.

## సృష్టి ఫెర్టిలిటీ స్కాం కేసులో మరో కీలక పరిణామం



**న్యూస్ డెస్క్ 12 ఆగష్టు (కెరటం న్యూస్):** సృష్టి ఫెర్టిలిటీ స్కాం కేసులో మరో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఈ కేసును సిట్‌కు అప్పగిస్తూ తెలంగాణ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. మంగళవారం ఈ కేసుకు సంబంధించిన విషయాలను హైదరాబాద్ నార్త్ జోన్ డీసీపీ రష్మీ పెరుమాళ్ మీడియాకు వెల్లడించారు. సృష్టి కేసును సీసీఎస్ సిట్‌కి బదిలీ చేసినట్లు తెలిపారు. ఈ కేసులో 25 మంది నిందితులను అరెస్ట్ చేశామని వెల్లడించారు. సృష్టి కేసులో 8 FIRలు నమోదు చేశామని వివరించారు. ఓ కేసులో సృష్టి యాజమాన్యం బాధితులకు చనిపోయిన బిడ్డను చూపించారని చెప్పుకొచ్చారు. మరో కేసులో రూ.15 లక్షలు ఎక్కువగా ఇవ్వాలని సృష్టి యాజమాన్యం డిమాండ్ చేసిందని తెలిపారు డీసీపీ రష్మీ పెరుమాళ్.

## ఉప ఎన్నికలను రద్దు చేయాలి

**- మాజీ సీఎం జగన్ సంచలన డిమాండ్**



**న్యూస్ డెస్క్, 12 ఆగష్టు (కెరటం న్యూస్):** పులివెందుల జడ్పీటీసీ ఉప ఎన్నిక మంగళవారం ఉదయం ప్రారంభమై సాయంత్రం 5 గంటలకు ముగిసింది. ఉప ఎన్నికలపై వైసీపీ అధినేత, మాజీ సీఎం జగన్ తీవ్ర విమర్శలు గుప్పించారు. రాష్ట్రంలో ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తూ పులివెందుల, ఒంటిమిట్ట జడ్పీటీసీ సీట్లను సీఎం చంద్రబాబు నాయుడు గుండా మాదిరిగా హైజాక్ చేశారని ఆరోపించారు. అధికారాన్ని దుర్వినియోగం చేస్తూ రిగ్గింగ్‌కు పాల్పడ్డారని విమర్శించారు. ఇది ప్రజాస్వామ్యానికి బ్లాక్ డే. ఉప ఎన్నికలను రద్దు చేయాలని, కేంద్ర బలగాల ఆధ్వర్యంలో మళ్లీ నిర్వహించాలని మాజీ సీఎం జగన్ ఎన్నికల సంఘాన్ని డిమాండ్ చేశారు.సీఎం చంద్రబాబు అధికారంలో ఉండగా రాష్ట్రంలో ప్రజాస్వామ్యం అన్నది ఒక డొల్ల మాత్రమే అని దుయ్యబట్టారు.

## సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు.. పౌరసత్వానికి ఆధార్ ప్రూఫ్ చెల్లదు



**న్యూస్ డెస్క్, 12 ఆగష్టు (కెరటం న్యూస్):** ఆధార్ కార్డు ఐటెండిఫికేషన్ పై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది.. ప్రభుత్వ, ప్రైవట్ పరంగా వివిధ సేలలు పొందేందుకు ఆధార్ కార్డును ఓ గుర్తింపు కార్డుగా ఉపయోగించ్చు కానీ.. భారత దేశ పౌరసత్వానికి ఇది ఖచ్చితమైన ప్రూఫ్ కాదని చెప్పింది భారత అత్యున్నత న్యాయస్థానం. బీహార్‌లో జరుగుతున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (SIR) ఎలక్టోరల్ రోల్స్ వివాదం నేపథ్యంలో ఈ తీర్పు వెలువడింది. ఈ కేసులో సుప్రీంకోర్టు ఆధార్ కార్డు, ఎలక్టోరల్ ఫోటో ఐడెంటిటీ కార్డు (EPIC), రేషన్ కార్డులను పౌరసత్వ రుజువుగా పరిగణించలేమని స్పష్టం చేసింది.

మంగళవారం జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మల్య బాగ్చీలతో కూడిన సుప్రీంకోర్టు బెంచ్ ఈ కేసును విచారించింది. ఈ విచారణలో ఎన్నికల కమిషన్ ఆధార్ కార్డును పౌరసత్వ రుజువుగా అంగీకరించకపోవడం సరైనదేనని కోర్టు సమర్థించింది.

## శంషాబాద్ ఎయిర్‌పోర్టులో రూ.13 కోట్ల విలువైన గంజాయి పట్టివేత



**న్యూస్ డెస్క్, 12 ఆగష్టు (కెరటం న్యూస్):** శంషాబాద్ ఎయిర్‌పోర్టులో ఖరీదైన గంజాయిని డీఆర్ఐ అధికారులు పట్టుకున్నారు. బ్యాంకాక్ నుంచి వచ్చిన ఓ ప్రయాణికురాలి వద్ద నుంచి రూ.13.3 కోట్లు విలువైన హైడ్రోఫోనిక్ గంజాయిని గుర్తించి స్వాధీనం చేసుకున్నారు.

## అన్నదమ్ములం ఇద్దరం సమర్థులమే...

## మంత్రి పదవి ఇస్తే తప్పేంటి

మంత్రి పదవికి హామీ ఇచ్చి ఇప్పుడు సమీకరణల మాట ఎందుకు?

- ఖమ్మం జిల్లాకు ముగ్గురు మంత్రులు ఉంటే నల్గొండకు ఎందుకు కాదు?- కోమటిరెడ్డి ప్రశ్నల వర్షం



**న్యూస్ డెస్క్, 12 ఆగష్టు (కెరటం న్యూస్):** మునుగోడు ప్రజలకు అన్యాయం జరిగితే తనకు అన్యాయం జరిగినట్లేనని కాంగ్రెస్ మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి వ్యాఖ్యానించారు. తనకు అన్యాయం జరిగితే ఫర్వాలేదు కానీ మునుగోడు ప్రజలకు అన్యాయం చేయొద్దని.. గత ప్రభుత్వానికి చెప్పానని.. ఈ ప్రభుత్వానికీ చెబుతున్నానని పేర్కొన్నారు. కాంగ్రెస్ హై కమాండ్ తనకు మంత్రి పదవి ఇస్తానని మాట ఇచ్చిందని, మంత్రి పదవి ఇచ్చినప్పుడు ఇవ్వండి, కానీ.. అప్పటివరకు మాత్రం మునుగోడు అభివృద్ధికి సహకరించి ఒక్క రూపాయి కూడా ఆపొద్దని కోరారు.

## బండి సంజయ్‌కి

## కేటీఆర్ లీగల్ నోటీసులు..

- ఆరోపణలను రుజువు చేయాలని సవాల్..!
- 48 గంటల్లో క్షమాపణ లేదంటే కోర్టుకు ఈడుస్తా
- అసత్య ఆరోపణలు చేస్తే క్రిమినల్ చర్యలు తప్పవు
- ఛీప్ పబ్లిసిటీ కోసం వీధి నాటకాలు ఆడుతున్న బండి సంజయ్ - తీవ్రంగా ఫైర్ అయిన కేటీఆర్



**న్యూస్ డెస్క్, 12 ఆగష్టు (కెరటం న్యూస్):** కేంద్రమంత్రి బండి సంజయ్‌కి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ లీగల్ నోటీస్ పంపించారు. ఫోన్ల ట్యాపింగ్ కేసులో అసత్యాలు మాట్లాడినందుకు నోటీస్ పంపినట్లు తెలిపారు. బండి సంజయ్ కేంద్రమంత్రిగా ఉండి బాధ్యతారహితంగా మాట్లాడారని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఒక ప్రజాప్రతినిధిపై అసత్య ఆరోపణలు చేయడం సరికాదంటూ నోటీసులలో పేర్కొన్నారు.

# సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు.. పౌరసత్వానికి ఆధార్ ప్రూఫ్ చెల్లదు

ఎన్నికల కమిషన్ ఆధార్ కార్డును పౌరసత్వానికి ఖచ్చితమైన రుజువుగా అంగీకరించలేమని చెప్పడం సరైనదే. దీనిని ధృవీకరించాల్సిన అవసరం ఉందని జస్టిస్ సూర్యకాంత్ అన్నారు.



ఆధార్ కార్డు వివిధ ప్రభుత్వ, ప్రైవేటు సేవలు పొందేందుకు గుర్తింపు డాక్యుమెంట్‌గా ఉపయోగపడుతుంది..కానీ ఇది ఒక వ్యక్తి జాతీయతను నిర్ధారించే సాక్ష్యం కాదని కోర్టు స్పష్టం చేసింది. ఆధార్ యాక్ట్, 2016లోని సెక్షన్ 9 ప్రకారం.. ఆధార్ కార్డు కేవలం గుర్తింపు ధృవీకరణ కోసం మాత్రమేనని పౌరసత్వ ధృవీకరణకు కాదని కోర్టు తెలిపింది.

పిటిషనర్ల తరఫున సీనియర్ అడ్వొకేట్ కపిల్ సిబల్ వాదిస్తూ.. SIR ప్రక్రియలో ప్రొసీజరల్ అసమానతలు ఉన్నాయని, ఇది పెద్ద సంఖ్యలో ఓటర్లను అనర్హులుగా మార్చే అవకాశం ఉందని వాదించారు. 1950 తర్వాత భారతదేశంలో జన్మించిన వారందరూ పౌరులుగా గుర్తించాలని.. అయితే SIR ప్రక్రియలో ఓటర్లను తొలగించడం అన్యాయమని కపిల్సిబాల్ వాదించారు. బూత్ లెవెల్ ఆఫీసర్లు సరిగ్గా పనిచేయడం లేదని, జీవించి ఉన్న వ్యక్తులను చనిపోయినట్లు జాబితా చేయడంతో 65 లక్షల మంది ఓటర్ల పేర్లను ధృవీకరణ లేకుండా తొలగించడం వంటి సమస్యలను ఆయన కోర్టుముందు ఉంచారు.

ఎన్నికల కమిషన్ తరఫున సీనియర్ అడ్వొకేట్ రాకేష్ ద్వివేదీ వాదిస్తూ..SIR ప్రక్రియ ఎలక్టోరల్ రోల్స్‌ను రివిజన్ చేయడం రాజ్యాంగబద్ధమైన అవసరం,ఆధార్, EPIC, రేషన్ కార్డులు పౌరసత్వాన్ని నిరూపించే డాక్యుమెంట్లుగా చట్టబద్ధత లేనివని వాదించారు. ఈ డాక్యుమెంట్లు గుర్తింపు కార్డులుగా ఉపయోగిస్తున్నప్పటికీ పౌరసత్వాన్ని నిర్ధారించవని ECI తెలిపింది. ఈ ప్రక్రియలో ఎటువంటి పౌరుడి పౌరసత్వాన్ని రద్దు చేయడం జరగదు.. కేవలం ఓటింగ్ అర్హతను మాత్రమే నిర్ధారిస్తున్నామని ECI స్పష్టం చేసింది.

సుప్రీంకోర్టు ఆధార్ కార్డు పౌరసత్వ రుజువుగా చెల్లదని తేల్చడం ద్వారా ఎన్నికల కమిషన్ SIR ప్రక్రియను సమర్థించింది.అయితే ఈ ప్రక్రియ సమయం,విధానంపై ఆందోళనలను కూడా వ్యక్తం చేసింది. ఈ కేసు దేవంలో ఎలక్టోరల్ రిఫార్మ్‌లు ,పౌరసత్వ ధృవీకరణకు సంబంధించిన ముఖ్యమైన చర్చను రేకెత్తించింది.

# సృష్టి ఫెర్టిలిటీ స్కాం కేసులో మరో కీలక పరిణామం

విశాఖపట్నంలో కూడా సరోగసీ పేరుతో మోసం చేశారని డీసీపీ రష్మీ పెరుమాళ్ పేర్కొన్నారు. బాధితులకు ఇచ్చిన బేబీ గర్ల్‌కి డీఎన్ఏ టెస్ట్ చేసి సరి పోల్చినప్పుడు ఈ వ్యవహారం బయట పడిందని వెల్లడించారు. ఈ కేసులో చాలామంది డాక్టర్ల ప్రమేయం ఉందని తెలిపారు.



విశాఖపట్నంలోని డాక్టర్లు విద్యులత, రవిను అరెస్ట్ చేశామని పేర్కొన్నారు. వైజాగ్‌కి చెందిన డాక్టర్ విద్యులతతో పాటు డాక్టర్ రవి, డాక్టర్ ఉషను అరెస్ట్ చేశామని వివరించారు. సికింద్రాబాద్‌లో ఉన్న హాస్పిటల్‌ను కేవలం కన్సల్టెన్సీగా మాత్రమే వాడుకున్నారని గుర్తుచేశారు. ఇక్కడ IVF పేరుతో శాంపిల్స్ తీసుకుంటున్నారని చెప్పారు. మిగతా సరోగసీ ప్రాసెస్ అంతా వైజాగ్‌లో చేస్తున్నారని తెలిపారు. ఈ కేసులో ఇప్పటివరకు 25 మందిని అరెస్ట్ చేశామని వెల్లడించారు డీసీపీ రష్మీ పెరుమాళ్.వీరిలో చాలామంది మహిళలు ఉన్నారని... మహిళా నిందితుల్లో చాలామంది అండాలు అమ్ముకున్న వారు ఉన్నారని, సరోగసీ తల్లులుగా నటించిన వాళ్లు ఉన్నారని తెలిపారు. ఎవరైనా దంపతులు సరోగసీ కోసం అప్రోచ్ అవగానే.. వాళ్లకు కొన్నిరోజుల తర్వాత ఒక ఫేక్ అల్ట్రా స్కాన్ రిపోర్ట్ పంపుతారని చెప్పుకొచ్చారు. సరోగసీ పద్ధతిలో మీకు పుట్టబోయే పాప స్కానింగ్ రిపోర్ట్ అని చెబుతారని అన్నారు. అదే సమయంలో డాక్టర్ నమ్రత ఏజెంట్లు ఓ గర్భిణిని వెతికిపెడతారని తెలిపారు. 9 నెలల తర్వాత వైజాగ్‌లో డెలివరీ చేసి.. ఆ శిశువును సరోగసీ ద్వారా పుట్టిన పాప అని చెప్పి దంపతులకు అప్పగిస్తారని నార్త్ జోన్ డీసీపీ రష్మీ పెరుమాళ్ పేర్కొన్నారు.

# శంషాబాద్ ఎయిర్‌పోర్టులో రూ.13 కోట్ల విలువైన గంజాయి పట్టివేత



**న్యూస్ డెస్క్, 12 ఆగష్టు (కెరటం న్యూస్):** శంషాబాద్ ఎయిర్‌పోర్టులో ఖరీదైన గంజాయిని డీఆర్ఐ అధికారులు పట్టుకున్నారు. బ్యాంకాక్ నుంచి వచ్చిన ఓ ప్రయాణికురాలి వద్ద నుంచి రూ.13.3 కోట్లు విలువైన హైడ్రోఫోనిక్ గంజాయిని గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. మహిళను అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించారు. గత నెల 30న కూడా బ్యాంకాక్ నుంచి వచ్చిన ఓ మహిళ వద్ద రూ.40 కోట్లు విలువ చేసే హైడ్రోఫోనిక్ గంజాయిని అధికారులు స్వాధీనం చేసుకున్నారు.

# బీసీ గర్జన సభను మరోసారి వాయిదా వేసిన బీఆర్ఎస్

**న్యూస్ డెస్క్, 12 ఆగష్టు (కెరటం న్యూస్):** స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అమలుకు ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలనే ఉద్దేశ్యంతో బీఆర్ఎస్ పార్టీ కథన భేరి పేరిట నిర్వహించ తలపెట్టిన బీసీ గర్జన సభను మరోసారి వాయిదా వేసింది. భారీ వర్ష సూచన నేపథ్యంలో కరీంనగర్ వేదికగా నిర్వహించ తలపెట్టిన ఈ భారీ బహిరంగ సభను వాయిదా వేస్తున్నట్లు ప్రకటించింది. ఈ మేరకు కరీంనగర్ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ పార్టీ నేత గంగుల కమలాకర్.. తన ఎక్స్ ఖాతా వేదికగా ఈ ప్రకటన చేశారు. భారీ వర్ష సూచన కారణంగానే ఈ సభను వాయిదా వేసినట్లు ఆయన తెలిపారు.

రాష్ట్రంలో భారీ వర్షాలు కురుస్తున్నాయని.. అందులో భాగంగా ఆగస్ట్ 14, 15, 16, 17 తేదీల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ ఇప్పటికే సూచించిందని వివరించారు. ఈ క్రమంలో ఈ కథన భేరి సభను వాయిదా వేసినట్లు తెలిపారు. అయితే వాతావరణం అనుకూలించిన తర్వాత ఈ సభను నిర్వహించాలని పార్టీ అగ్రనాయకత్వం భావిస్తుందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ఈ కథనభేరి సభను మళ్లీ ఎప్పుడు నిర్వహించనున్నది మరికొద్ది రోజుల్లో నిర్ణయించి.. ప్రకటిస్తామని మంత్రి గంగుల కమలాకర్ పేర్కొన్నారు. ఈ విషయాన్ని పార్టీ నేతలు, కార్యకర్తలు గమనించాలని సూచించారు.

అసలు అయితే ఆగస్ట్ 8వ తేదీన కరీంనగర్ వేదికగా ఈ కథన భేరీ సభ నిర్వహించాలని బీఆర్ఎస్ పార్టీ నాయకత్వం తొలుత నిర్ణయించింది. కానీ ఎందుకో.. ఈ సభను ఆగస్ట్ 14వ తేదీకి వాయిదా వేసినట్లు ప్రకటించింది. కానీ భారీ వర్షాల నేపథ్యంలో ఈ సభను మరోసారి వాయిదా వేశారు. ఈ సభ ఏర్పాటుపై వాయిదాల పర్వం కొనసాగడానికి వెనుక ఉన్న కారణాలు ఏమై ఉంటాయనే ఒక చర్చ అయితే రాజకీయ వర్గాల్లో బలంగా సాగుతోంది.

# మా శాఖ కాదు.. మా పరిధి కాదు అంటే ఊరుకోను

గ్రేటర్ హైదరాబాద్, గ్రామీణ ప్రాంతాల కోసం టోల్ ఫ్రీ హెల్ప్ లైన్స్ ఏర్పాటు చేయాలి. సమాచారం ఎప్పటికప్పుడు కమాండ్ కంట్రోల్ రూంకు చేరుకునేలా ఏర్పాట్లు చేయాలి.



హైదరాబాద్‌తో పాటు వరద ప్రభావం ఎక్కువగా ఉండే జిల్లాల్లో ముందస్తు చర్యలు తీసుకోవాలి. నగరంలోని మూడు కమిషనరేట్ల పరిధిలో ట్రాఫిక్ నియంత్రణకు సివిల్ పోలీసుల సేవలను వినియోగించుకోవాలి. పాఠశాలలు, కాలేజీలు నడపాలా, సెలవు ప్రకటించాలా అన్నది స్థానిక పరిస్థితులకు అనుగుణంగా నిర్ణయం తీసుకోవాలి. హైదరాబాద్, రంగారెడ్డి లాంటి ప్రాంతాల్లో ఐటీ సంస్థలు వర్క్ ఫ్రమ్ హోం నిర్వహించుకునేలా ఆయా సంస్థలతో ఐటీ స్పెషల్ చీఫ్ సెక్రెటరీ గారు సమన్వయం చేయాలి. వీలైనంత వరకు ప్రజలను రోడ్లపైకి రాకుండా అప్రమత్తం చేయాలి. హైడ్రా తరఫున ఎఫ్ఎం రేడియోల ద్వారా, టీవీల ద్వారా ప్రజలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేయాలి. ప్రజలను ఆందోళనకు గురిచేసే సమాచారం ఇచ్చే సంస్థలకు వెనువెంటనే వాస్తవాలను వెల్లడించాలి.

నగరంలో శిథిలావస్థలో ఉన్న భవనాలున్నాయి. జోనల్ కమిషనర్లను అప్రమత్తమై అలాంటి చోట ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలి. భారీ వర్షాలతో ఆకస్మిక వరదలు సంభవించినప్పుడు ఎయిర్ లిఫ్టింగ్ చేసేందుకు అవసరమైన హెలికాప్టర్స్ ఉండేలా చూసుకోవాలి. NDRF సిబ్బందితో ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకోవాలి. Hydraa 24 గంటలపాటు అప్రమత్తంగా ఉండాలి. డిజాస్టర్ మేనేజ్‌మెంట్ విభాగంలో 2 వేల మందికి శిక్షణ ఇచ్చాం. సహాయక చర్యల కోసం ఎక్కడ అవసరమైతే వారిని అక్కడికి తరలించాలి. విద్యుత్ అంతరాయం ఏర్పడితే తక్షణం పునరుద్ధరణ పనులు చేపట్టాలి. మొబైల్ ట్రాన్స్‌ఫార్మర్స్, అవసరమైతే జనరేటర్స్‌ను సమకూర్చాలి. విద్యుత్‌కు సంబంధించి అత్యవసర సమయాల్లో ఉపయోగించుకునేందుకు వీలుగా మొబైల్ ట్రాన్స్‌ఫార్మర్స్ అందుబాటులో ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలి.

ఎక్కడా తాగునీటి సమస్య రాకుండా, అలాగే పట్టణాల్లో డ్రైనేజీ సమస్యలు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. వైద్య ఆరోగ్య శాఖ ద్వారా అత్యవసర సమయాల్లో అవసరమైన మెడిసిన్స్, సౌకర్యాలను అన్నింటినీ సిద్ధం చేసుకోవాలి. ఏ ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరించిందో ఆ ప్రాంతాల్లో సమన్వయం కోసం కలెక్టర్లు అదనంగా అధికారులను నియమించుకోవాలి. హైదరాబాద్, రాచకొండ, సైబరాబాద్ కమిషనరేట్ల పరిధిలో మూసీ పరివాహక ప్రాంతంతో పాటు ప్రమాద స్థాయికి నీరు చేరుకునే ప్రాంతాలకు ప్రజలను వెళ్లనీయకుండా పోలీసులు నియంత్రించాలి. ప్రాజెక్టులు, చెరువులు, కుంటల్లోకి ఇన్‌ఫ్లో, ఔట్ ఫ్లోపై నీటి పారుదల శాఖ అధికారులు పూర్తి అవగాహనతో ఉండాలి. లోతట్టు ప్రాంతాల ప్రజలకు నీటి విడుదలపై పూర్తి సమాచారం ఇవ్వాలి. చెరువులు, కుంటలు కట్టలు తెగే ప్రమాదం ఉన్నందున ముందస్తుగా తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. మా శాఖకు సంబంధం లేదని ఏ విభాగం చెప్పడానికి వీలులేదు. అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలి. ప్రస్తుత పరిస్థితులను ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకోవడానికి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ప్రత్యేకంగా ఒక గ్రూప్ ను క్రియేట్ చేసుకుని సమన్వయం చేసుకోవాలి. అవసరమైతే కొందరు సీనియర్ ఆఫీసర్లను డిప్యూట్ చేసుకోవాలని రేవంత్ రెడ్డి వార్నింగ్ ఇచ్చారు.

# అమెరికాలో రోడ్డు ప్రమాదం.. హైదరాబాద్ విద్యార్థిని మృతి

శ్రీనివాస్ వర్మ దంపతులు బతుకుదెరువు కోసం కొన్నేళ్ల క్రితం నగరానికి వలస వచ్చారు. మేడ్చల్ జిల్లా గండిమైసమ్మ చౌరస్తా సమీపంలోని శ్రీకృష్ణానగర్‌లో నివాసముంటున్నారు. శ్రీనివాస్ వర్మ డ్రైవర్‌గా పనిచేస్తుండగా.. ఆయన భార్య ఓ ప్రైవేటు సంస్థలో పనిచేస్తున్నారు.

వీరి పెద్ద కుమార్తె శ్రీజా వర్మ ఉన్నత చదువుల కోసం అమెరికా వెళ్లింది. ఈ మధ్యే ఎంఎస్ పూర్తి చేసింది. సోమవారం రాత్రి (భారత కాలమానం ప్రకారం) అపార్ట్‌మెంట్ నుంచి బయటకు వచ్చి భోజనం చేసేందుకు కారులో రెస్టరంట్‌కు వెళ్లింది. భోజనం చేసి తిరిగి వస్తుండగా ఆమె వాహనాన్ని ట్రక్కు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో శ్రీజా వర్మ తీవ్రంగా గాయపడి మృతిచెందింది. ప్రమాదం జరిగిన సమయంలో కారులో శ్రీజా వర్మతో పాటు ఆమె స్నేహితురాలు కూడా ఉన్నట్లు సమాచారం. శ్రీనివాస్ వర్మ చిన్న కుమార్తె శ్రేయా వర్మ సైతం ఎంఎస్ చేసేందుకు 20 రోజుల క్రితం అమెరికా వెళ్లింది.

# కోడి గుడ్ల కుంభకోణం రూ. 600 కోట్లు : ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్

**న్యూస్ డెస్క్, 12 ఆగష్టు (కెరటం న్యూస్):** కాంగ్రెస్ పార్టీ అంటేనే కుంభకోణాల పార్టీ, కమీషన్ల పార్టీ అని బీఆర్ఎస్ సీనియర్ నేత ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. తాజాగా కాంగ్రెస్ ప్రభుత్వం తెచ్చిన జీవో 17పై ఆయన మండిపడ్డారు. తెలంగాణ భవన్‌లో ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ గురుకులాలు, వివిధ స్కూళ్ల ఫుడ్ కాంట్రాక్టర్లతో కలిసి మీడియాతో మాట్లాడారు.

కేసీఆర్ తెలంగాణ తొలి సీఎంగా సంపద పేద వాళ్ళ చేతిలో ఎలా పెట్టాలి అని ఆలోచించే వారు. రేవంత్ రెడ్డి తెలంగాణ ప్రజల కళ్ళు కప్పి కుంభకోణాలకు పాల్పడుతూ సంపదనంతా ధనవంతుల చేతిలో పెట్టే ప్రయత్నం చేస్తున్నారు. తాజాగా జీవో 17 తెచ్చి కోడిగుడ్ల కుంభకోణానికి పాల్పడ్డారు. దాదాపు రూ. 600 కోట్ల కుంభ కోణం ఇది. 20 వేల మంది చిరు వ్యాపారుల పొట్ట కొట్టేందుకు జీవో 17 తెచ్చారు. గురుకులాలు, కేజీవీబీ, ఇతర స్కూళ్లల్లో ఫుడ్ కాంట్రాక్టర్లను మార్చేందుకు నిబంధనలను సడలిస్తూ జీవో 17 ఇచ్చారు. ఈ జీవో తో 20 వేల మంది వాళ్ళ మీద ఆధారపడే లక్ష మంది రోడ్ల మీద పడతారు. ఫుడ్ కాంట్రాక్టర్లు 50 లక్షల ఈఎండీ కట్టాలట.. పది తరాలు కష్టపడ్డా చిరు వ్యాపారులకు అంత డబ్బు రాదు. మండలం ఒక యూనిట్‌గా ఓకే బడా కాంట్రాక్టర్‌కు కాంట్రాక్టు కట్టబెట్టే ప్రయత్నం జరుగుతోంది. ఎస్సీ, ఎస్టీ కాంట్రాక్టర్లకు కేసీఆర్ హయంలో రాయితీ ఉండేది అని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ గుర్తు చేశారు.

మల్లికార్జున్ ఖర్గే ఎక్కడున్నారు, దళిత మంత్రులు ఎక్కడ ఉన్నారు. చేవెళ్ల డిక్లరేషన్‌లో 25 శాతం దళితులకు కాంట్రాక్టులు ఇస్తామని చెప్పారు. అది అమలు కాకపోగా వాళ్ళ నుంచి ఉన్నవి లాక్కుంటున్నారు. కోడి గుడ్లు సరఫరా చేసేందుకు రూ. 3 కోట్ల టర్నోవర్ ఉండాలట. కేసీఆర్ హాయంలో ఈ నిబంధనలు లేవు. జానారెడ్డి బంధువులో రేవంత్ బంధువులకో కాంట్రాక్టులు ఇచ్చేందుకు కుట్ర చేస్తున్నారు. టెండర్ అప్లికేషన్‌కు ఐదు వేల నుంచి రూ. 25 వేల వసూల్ చేస్తున్నారు. కోడి గుడ్డు రేటు గతంలో మార్కెట్ రేటు కన్నా 30 పైసలు ఎక్కువ ఉండేది. ఇప్పుడు కోడి గుడ్డు ధర ఏడు రూపాయలుగా నిర్ణయించారు. కాంట్రాక్టర్ల నుంచి బ్యూరోక్రాట్లు, కాంగ్రెస్ నేతలు కమిషన్లు వసూలు చేస్తున్నారు. ఘోరమైన నేరాలు సోషల్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్‌లో జరుగుతున్నాయని ఆర్ఎస్పీ పేర్కొన్నారు.

కేసీఆర్ పది సంవత్సరాల్లో పేద వాళ్ళ గురించి ఆలోచించారు. గురుకులాల్లో రేవంత్ పాలనలో ఇప్పటి వరకు 103 మంది విద్యార్థులు చనిపోయారు. ఈ విద్యార్థుల మరణాల గురించి పట్టించుకునే శ్రద్ధ సీఎం రేవంత్‌కు లేదు. కాంగ్రెస్ నేతలను మరింత ధనవంతులుగా మార్చేందుకు జీవో 17 తెచ్చారు. టెండర్లకు ఈ నెల 14 దాకా గడువు విధించారు. టెండర్ నిబంధనలు ఇంగ్లీష్‌లో రాసి ఆన్‌లైన్‌లో పెట్టారు. చిరు వ్యాపారులకు అవి అర్థం కావు. ఈ జీవో 17ను రద్దు చేయాల్సిందే. జీవో 17 రద్దుకు బీఆర్ఎస్ ఉద్యమిస్తోంది. జీవో 17 రద్దు కోసం కోర్టుకు కూడా వెళతాం. గురుకులాల్లో వ్యవస్థలను ధ్వంసం చేసే కుట్ర జరుగుతోంది. కలెక్టర్లు, అదనపు కలెక్టర్ల కమీషన్ల మా దగ్గర ఆధారాలు ఉన్నాయి. త్వరలోనే సీఎస్‌ను కలిసి మా దగ్గరున్న ఆధారాలు సమర్పిస్తాం అని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ అన్నారు.

# సీబీఐ చేతికి అడ్వకేట్ వామనరావు దంపతుల మర్డర్ కేసు

2021, ఫిబ్రవరి 17న వామనరావు దంపతులు దారుణ హత్యకు గురైన విషయం తెలిసిందే. కారులో వెళ్తుండగా మంథని హైవే పై కత్తులతో దాడి చేసి అత్యంత కిరాతకంగా హత్య చేశారు దుండగులు. వామనరావు దంపతుల మర్డర్ కేసు అప్పట్లో దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. ఈ కేసులో బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే పుట్టా మధుపై ఆరోపణలు వెల్లువెత్తాయి. పుట్ట మధు తన మనుషులతో హత్య చేయించాడని వామనరావు బంధులు ఆరోపించారు. ఈ క్రమంలో అడ్వకేట్ దంపతులు వామనరావు, గట్టు నాగమణి హత్య కేసును సీబీఐకి అప్పగించాలని మృతుడి తండ్రి సుప్రీంకోర్టును అభ్యర్థించారు. ఈ అంశంపై వామనరావు తండ్రి గట్టు కిషన్ రావు పిటిషన్ దాఖలు చేశారు. వామనరావు దంపతుల హత్య కేసులో అప్పటి అధికార బీఆర్ఎస్ పార్టీకి చెందిన నేత పుట్టా మధు పోలీసులను ప్రభావితం చేశారని, పోలీసుల విచారణపై తమకు నమ్మకం లేదని ఈ కేసును సీబీఐకి అప్పగించాలని ఆయన కోరారు.

ఈ పిటిషన్ పై విచారణ జరిపిన సుప్రీంకోర్టు ఈ కేసుకు సంబంధించిన వీడియోలు సహా అన్ని పత్రాలు తమ ముందు ఉంచాలని తెలంగాణ ప్రభుత్వాన్ని గతంలో ఆదేశించింది. సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు కేసుకు సంబంధించిన ఎవిడెన్స్ మొత్తం రాష్ట్ర ప్రభుత్వం న్యాయస్థానానికి సమర్పించింది. వామనరావు మరణ వాంగ్మూలం వీడియోకు సంబంధించిన ఎఫ్ఎస్ఎల్ రిపోర్టును కూడా కోర్టులో ప్రొడ్యూస్ చేసింది రాష్ట్ర ప్రభుత్వం.

అలాగే, వామనరావు దంపతుల కేసును సీబీఐకి అప్పగించడంలో తమకేలాంటి అభ్యంతరం లేదని తెలంగాణ సర్కార్ స్పష్టం చేసింది. ఇరువర్గాల వాదనలు విన్న సుప్రీంకోర్టు.. వామనరావు దంపతుల మర్డర్ కేసును సీబీఐకి అప్పగిస్తూ ఆదేశాలు జారీ చేసింది. బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే పుట్టా మధుపై తీవ్ర ఆరోపణలు వెల్లువెత్తిన ఈ కేసును సుప్రీంకోర్టు సీబీఐకి బదిలీ చేయడంతో నెక్ట్స్ ఏం జరగబోతుందని ఉత్కంఠగా మారింది.

# ఉప ఎన్నికలను రద్దు చేయాలి



ఈ రాష్ట్రంలో రాజ్యాంగం, చట్టం, న్యాయం, ధర్మం, నిబంధనలు, ప్రజాస్వామ్య పద్ధతులు అన్నవి ఒట్టి మాటలేనని, వ్యవస్థలనేవి కేవలం అలంకార ప్రాయం మాత్రమేనని మరోమారు రుజువైందని వైఎస్ జగన్ పేర్కొన్నారు. ఎన్నికలు ఏవైనా ఏ గ్రామంలో ఓటర్లకు అదే గ్రామంలో పోలింగ్ నిర్వహించడం గతం వరకూ నుంచో పాటిస్తున్న విధానమని గుర్తుచేశారు. కానీ, సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు పులివెందుల ZPTC పరిధిలోని పలు గ్రామాల పోలింగ్ బూత్‌లను అటు ఇటు మారుస్తూ, 2 కి.మీ, 4 కి.మీ.ల దూరానికి మార్చినప్పుడే క్షుద్ర రాజకీయాలకు నాంది పడింది అని విమర్శించారు.

ఈ క్రమంలో వైసీపీకి చెందిన ఏజెంట్లు బూత్‌ల్లో కనీసం కూర్చోనీయలేదు, ఓటర్లను బూత్‌లవైపునకు రానీయకుండా ఎక్కడికక్కడ భయపెట్టి రిగ్గింగ్‌కు పాల్పడ్డారని ఆరోపించారు. మహిళా ఏజెంట్ల పైన కూడా దాడులు చేశారని మండిపడ్డారు. స్వేచ్ఛగా ప్రజలు ఓట్లేయడానికి కాపలాకాయాల్సిన డీఎస్పీలు, సీఐలు, ఎస్సైలు ఇతర పోలీసులు సీఎం చంద్రబాబు తప్పుడు ఆదేశాలకు తలొగ్గుతూ, టీడీపీ వాళ్లు చేసే దాడులు, దౌర్జన్యాలకు దగ్గరుండి కాపలా కాశారని తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. ప్రశాంతంగా పోలింగ్ జరిగేలా చూడాల్సిన డీఐజీ కోయ ప్రవీణ్, టీడీపీ మాజీ ఎంపీ కంభంపాటి రామ్మోహనరావు సమీప బంధువు, పచ్చచొక్కా వేసుకుని దగ్గరుండి ఎన్నికల అక్రమాలను ప్రోత్సహించారని వైఎస్ జగన్ ఆరోపించారు. మరి దీన్ని ఎన్నిక అని ఎవరైనా అనగలుగుతారా? మరి ఎందుకు ఈ ఎన్నికలు జరపడం? అని మాజీ సీఎం జగన్ ట్విట్టర్ వేదికగా విమర్శలు గుప్పించారు.

# బండి సంజయ్‌కి కేటీఆర్ లీగల్ నోటీసులు..

బండి సంజయ్ తన రాజకీయ ఉనికి కోసమే అసత్యపూరిత వ్యాఖ్యలు చేస్తున్నారని కేటీఆర్ ఆగ్రహం వ్యక్తంచేశారు. అసత్య ఆరోపణలు చేసినందుకు వెంటనే క్షమాపణ చెప్పాలని లీగల్ నోటీసులలో డిమాండ్ చేశారు. భవిష్యత్‌లోనూ అసత్య ఆరోపణలు చేయకుండా ఉండాలని పేర్కొన్నారు. లేదంటే క్రిమినల్ చర్యలకు కూడా బాధ్యులు కావాల్సి వస్తుందని హెచ్చరించారు.

అయితే ఫోన్ ట్యాపింగ్ అంశంపై బండి సంజయ్ చేసిన ఆరోపణలను కేటీఆర్ ఆయనకు లీగల్ నోటీస్‌లు పంపకముందే తిప్పికొట్టారు. బాధ్యతయుతమైన కేంద్రమంత్రి హోదాలో ఉన్న బండి సంజయ్.. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో చిల్లరగా, దిగజారి మాట్లాడటం సరికాదన్నారు. దమ్ముంటే ఆరోపణల్లో ఒక్క శాతం నిజమున్నా నిరూపించాలని సవాల్ చేశారు. లేదంటే ఆరోపణలను ఉపసంహరించుకొని 48 గంటల్లో బహిరంగ క్షమాపణలు చెప్పాలని ఎక్స్ వేదికగా డిమాండ్ చేశారు. లీగల్ నోటీసులు పంపిస్తున్నానని, 48 గంటల్లో స్పందించకుంటే కోర్టుకు ఈడుస్తానని తీవ్రస్థాయిలో హెచ్చరించారు.

సున్నితమైన అంశంపై సంజయ్ హద్దు మీరి మాట్లాడుతున్నారని కేటీఆర్ ధ్వజమెత్తారు. కనీసం కామన్ సెన్స్ లేకుండా, వాస్తవాలను తెలుసుకోకుండా, అసంబద్ధమైన, దిగజారుడు, థర్డ్‌క్లాస్ స్థాయిలో చిల్లర కామెంట్లు చేయడం ఆయనకు రివాజుగా మారిందని నిప్పులు చెరిగారు. రాజకీయాల్లో చవకబారు పబ్లిసిటీ కోసం, మీడియా దృష్టిని ఆకర్షించేందుకు అడ్డగోలుగా మాట్లాడుతున్నారని దుయ్యబట్టారు. ఫోన్ ట్యాపింగ్ అంశం ఎంత సున్నితమైందో, చట్టపరంగా ఎంత కఠినమైందో సంజయ్‌కి తెలియకపోవడం విడ్డూరమని, కేంద్రమంత్రిగా ఉన్న సంజయ్‌కి నిఘా వ్యవస్థల పనితీరు, విధానాలపై కనీస అవగాహన, పరిజ్ఞానం, ఇంగిత జ్ఞానం కూడా లేకపోవడం దురదృష్టకరమని ఎద్దేవాచేశారు.

బాధ్యతాయుతమైన పదవిలో ఉన్న సంజయ్..ఉద్దేశపూర్వకంగా వాస్తవాలను వక్రీకరిస్తున్నారని, సాక్ష్యాలు లేకుండా ఆరోపణలు చేయడం ఆయన రాజకీయ దిగజారుడు తనానికి నిదర్శనమని కేటీఆర్ మండిపడ్డారు. కేంద్రమంత్రిగా పనిచేయడం అంటే ఢిల్లీ బాసులకు చెప్పులు మోసేంత ఈజీ కాదనే విషయం గ్రహించాలని దెప్పిపొడిచారు. ఫోన్ ట్యాపింగ్‌పై సంజయ్ మాట్లాడిన ప్రతిసారీ దిగజారుతున్నారని, తప్పుడు ప్రచారంతో ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని ఫైర్ అయ్యారు. మీడియాలో ఛీప్ పబ్లిసిటీ కోసం వీధి నాటకాలు ఆడుతున్నారని విరుచుకుపడ్డారు. ఇలాంటి చౌకబారు ఆరోపణలు చేస్తే సహించేది లేదని హెచ్చరించారు.

# అన్నదమ్ములం ఇద్దరం సమర్థులమే... మంత్రి పదవి ఇస్తే తప్పేంటి

తనకు మంత్రి పదవి ఇస్తామని చెప్పారని, అయితే సమీకరణాలు కుదరటం లేదని ఇప్పుడెందుకు అంటున్నారని ప్రశ్నించారు. తనకు మంత్రి పదవి ఇవ్వడం ఎందుకు కుదరటం లేదు.. ఆ సమీకరణలు రాకుండా ఎవరడ్డుకుంటున్నారు..? అని ప్రశ్నల వర్షం కురిపించారు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి. మంగళవారం మునుగోడు మండలం ఎలగలగూడెంలో రూ.20 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించిన గ్రామపంచాయతీ భవనాన్ని ఎమ్మెల్సీ నెలికంటి సత్యంతో కలిసి కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా రాజగోపాల్ రెడ్డి మీడియాతో మాట్లాడారు. తనను కాంగ్రెస్ పార్టీలోకి తీసుకునే సమయంలో మంత్రి పదవి ఇస్తాననే తీసుకున్నారని గుర్తుచేశారు. అప్పుడు తాము ఇద్దరం అన్నదమ్ములం కాంగ్రెస్‌లోనే ఉన్నామని తెలియదా? అని నిలదీశారు. పార్లమెంట్ ఎన్నికల సమయంలో మంత్రి పదవి ఇస్తానని రెండోసారి హామీ ఇచ్చారని.. అప్పుడు కూడా కాంగ్రెస్ పార్టీలో తాము ఇద్దరం అన్నదమ్ములం ఉన్నామని గుర్తులేదా? అని ప్రశ్నించారు రాజగోపాల్ రెడ్డి.

ఒడ్డు దాటే వరకు ఓడ మల్లయ్య.. ఒడ్డు దాటాక బోడి మల్లయ్య అన్న చందంగా కొంతమంది నేతల పరిస్థితి ఉందని విమర్శించారు. తొమ్మిది మంది ఎమ్మెల్యేలు ఉన్న ఖమ్మం జిల్లాకి ముగ్గురు మంత్రులు ఉన్నారు కదా? అని ప్రశ్నించారు. 11 మంది ఎమ్మెల్యేలు ఉన్న నల్గొండ జిల్లాకు ముగ్గురు మంత్రులు ఉండటం తప్పా అని నిలదీశారు. ఇద్దరం అన్నదమ్ముల్లో ఇద్దరం సమర్థులమేనని, ఇద్దరం గట్టి వాళ్లమేనని.. ఇద్దరికీ మంత్రి పదవులు ఇస్తే తప్పేంటని ప్రశ్నల వర్షం కురిపించారు. మంత్రి పదవి ఇవ్వడానికి ఆలస్యమైనా సరే తాను ఓపిక పడుతానని కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి పేర్కొన్నారు.

# స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పని చేయాలి



**చింతకాని, 12 ఆగష్టు (కెరటం న్యూస్):** స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పని చేయాలని డైప్యూటీ సిఎం సతీమని మల్లు నందిని విక్రమార్క అన్నారు. భట్టి చేసే అభివృద్ధి పనులకు ఆకర్షితులై సిపిఎం, బిఆర్ఎస్ పార్టీల నుండి పలు కుటుంబాలు కాంగ్రెస్ పార్టీ లోకి చేరారు. డీప్యూటి సిఎం మల్లు భట్టి విక్రమార్క సతీమణి అమ్మ ఫౌండేషన్ చైర్మన్ మల్లు నందిని విక్రమార్క గారి సమక్షంలో కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. స్థానిక సంస్థల సన్నాహక ఎన్నికల సమావేశంలో పాల్గొన్న ఖమ్మం జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పువ్వాళ్ళ దుర్గా ప్రసాద్, గిడ్డంగుల సంస్థ కార్పోరేషన్ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, టి పిసిసి ప్రధాన కార్యదర్శి నూతి సత్యనారాయణ మరియు అనుబంధ సంఘాల జిల్లా అధ్యక్షులు చింతకాని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అంబటి వెంకటేశ్వర్లు గారి ఆధ్వర్యంలో మండల పరిధిలోని పాతర్లపాడు గ్రామంలో ఈరోజు సాయంత్రం స్థానిక సంస్థల ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించడం జరిగింది, ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డీప్యూటి సిఎం మల్లు భట్టి విక్రమార్క సతీమణి అమ్మ ఫౌండేషన్ చైర్మన్ నందిని విక్రమార్క పాల్గొని, మాట్లాడుతూ రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలలో మండల పరిధిలోని జెడ్పిటిసి, ఎంపీటీసీ లతో పాటుగా అన్ని గ్రామాలలో సర్పంచ్ అభ్యర్థులని గెలిపించుకునే దిశగా స్థానిక సంస్థల ఎన్నికలే లక్ష్యంగా పని చేయాలని కార్యకర్తలకు దిశానిర్దేశం చేయడం జరిగింది. మన లక్ష్యం సాధించుకోవడం కోసం రానున్న రోజులలో ప్రతి ఎంపీటీసీ పరిధిలో విస్తృతస్థాయి కార్యకర్తల సమావేశాలు నిర్వహించాలని దిశానిర్దేశం చేశారు ఈ కార్యక్రమంలో వివిధ హెూదాల్లో ఉన్న కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు,కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.



## ప్రజా సంక్షేమం కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

### మండల పార్టీ అధ్యక్షులు కూరెల్లి సతీష్




**ఇనుగుర్తి, 12ఆగష్టు (కెరటం న్యూస్):** మహబూబాబాద్ శాసనసభ్యులు భూక్య మురళి నాయక్ ఆదేశాల మేరకు ఇనుగుర్తి మండలం చిన్న ముప్పారం గ్రామంలో ఏర్పాటు చేసిన రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమానికి మండల పార్టీ అధ్యక్షులు కూరెల్లి సతీష్ హాజరై లబ్ధిదారులకు రేషన్ కార్డులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కూరెల్లి సతీష్ మాట్లాడుతూ ప్రజా సంక్షేమం, పేద ప్రజల అభివృద్ధి కాంగ్రెస్ ప్రభుత్వం లక్ష్యం అని అన్నారు. ఈ కార్యక్రమానికి జిల్లా నాయకులు కాలేరు శివాజీ, మాజీ ఎంపీటీసీ కదిరి జగన్, మండల నాయకులు ఏర్పుల నరసింహం, పిట్టల నరేష్, సుధాకర్ రెడ్డి, గుర్రం శివ, వీరేశం ,గంగాధర్, భానోత్ వీరన్న ,బాలు , రేషన్ డీలర్ మధుసూదన్ రెడ్డి ,పార్టీ కార్యకర్తలు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## మార్కెటింగ్ శాఖ పెన్షనర్లకుజూలై పెన్షన్లు చెల్లించండి

### -ఎస్జిపిఏటి డిమాండ్

**ఖమ్మం టౌన్, 12 ఆగష్టు (కెరటం న్యూస్):** రాష్ట్రంలోని 32 వ్యవసాయ మార్కెట్ కమిటీలలోని పెన్షనర్లకు జూలై పెన్షన్లు తక్షణం చెల్లించాలని రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం(ఎస్జిపిఏటి)ఖమ్మం జిల్లా యూనిట్ మార్కెటింగ్ శాఖ ఉన్నతాధికారులను డిమాండ్ చేసింది. ఖమ్మం తోపాటు రాష్ట్రంలోని వరంగల్, హైదరాబాద్, నిజామాబాదు, కరీంనగర్, ఆదిలాబాద్, సంగారెడ్డి, జనగాం, మహబూబాబాద్ తదితర 32మార్కెట్ కమిటీ పెన్షనర్లు జూలై పెన్షన్లు ఈరోజు వరకు పొందలేదని, సత్వరమే మార్కెటింగ్ శాఖ ఉన్నతాధికారులు స్పందించి సత్వరమే పెన్షన్లు చెల్లించేలా తగు చర్యలు తీసుకోవాలని ఎస్జిపిఏటి ఖమ్మం జిల్లా అధ్యక్షులు పరిశపుల్లయ్య, ప్రధాన కార్యదర్శి రాయలరవికుమార్ ఒక ప్రకటనలో డిమాండ్ చేసారు. ఇదిలాఉండగా జూన్ పెన్షను ఇప్పటివరకు పొందని వారిలో ఖమ్మం, భద్రాచలం, వేములవాడ, అచ్చంపేట మార్కెట్ కమిటీల పెన్షనర్లు ఉన్నారని ఎస్జిపిఏటి నాయకులు తెలిపారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల మాదిరిగా వ్యవసాయ మార్కెట్ కమిటీల పెన్షనర్లకు ట్రెజరీల ద్వారా పెన్షన్లు చెల్లించాలని రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం (ఎస్జిపిఏటి) రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నదని పుల్లయ్య, రవికుమార్ తెలిపారు.

## గంజాయి కేసులో నిందితులకి 20 సంవత్సరాలు జైలు శిక్ష



**ఖమ్మం లీగల్, 12 ఆగష్టు (కెరటం న్యూస్):** హైదరాబాద్ కు చెందిన నాయిక్ మల్లేష్(21), వై. రవితేజ (20) లకు గంజాయి కేసులో 20 సంవత్సరాల కఠిన కారాగార శిక్షతో పాటు నిందితులకు, రెండు లక్షల రూపాయల జరిమానా విధిస్తూ ఖమ్మం మొదటి అదనపు జిల్లా న్యాయాధికారి కె.ఉమాదేవి మంగళవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం ది 27.04.2021 రోజున నిందితులు భద్రచలం దగ్గర మోతుగూడెం లో అక్రమ గంజాయిని కొనుగోలు చేసి కారులో హైదరాబాద్ కు బయులదేరినారు. వారు మార్గమధ్యలో వి. వి. పాలేం దగ్గర వారి కారును అతివేగంగా నడుపుతూ ఎదురు గా వచ్చే ఫాసింజర్ ఆటోను వేగంగా ఢీ కొట్టడం వలన, ఆటో లో ఉన్న ఇద్దరు ఫాసింజర్ లు మరణించారు. నిందితులు కారు లో ఇరుక్కు ని పోగా పోలీస్ వారు వచ్చి ఆ కారును జేసిబి సహయంతో పగలగొట్టి నిందితుల దగ్గర ఉన్న 100 పాకేట్ల గంజాయి ని పట్టుకున్నారు. నిందితుల పైన ఖమ్మం రూరల్ పోలీస్ లు కేసు నమోదు చేశారు. అట్టి కేసును దర్యాప్తుచేసి కోర్టు లో చార్జీషీట్ ధాఖలు చేయగా, అట్టి కేసును విచారించిన న్యాయమూర్తి నిందితులపై నేరం రుజువు కావడంతో పైవిధంగా తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరుపున పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎ. శంకర్, వాదించగా జమ్ముల శరత్ కుమార్ రెడ్డి వాదించగా లైజనింగ్ అధికారి శ్రీకాంత్,,కోర్టు కానిస్టేబుల్ రవికిషోర్, సాంబశివరావు, హెూంగార్డు యం.డి ఆయ్యూబ్ లు సహకరించారు.

## ప్రభుత్వాలు మారిన తీరని కాలనీవాసుల కష్టాలు




**వరంగల్, 12ఆగష్టు (కెరటం న్యూస్):** వరంగల్ నగరంలోని కాశిబుగ్గ ప్రాంతంలో గల సాయి గణేష్ కాలనీ, వివేకానంద కాలనీ, లక్ష్మీగణపతి కాలనీలో వరద నీరు ముంచెత్తి చెరువులు తలపించింది. పట్టణం విస్తరిస్తున్న కొద్ది కొత్త కాలనీలు పుట్టుకొస్తున్నాయి, అయితే వీటికి సరైన ప్రణాళిక ఉండకపోవటం వల్ల డ్రైనేజీ వ్యవస్థ తాగునీటి సరఫరా వంటి వాటిని ముందుగా ఏర్పాటు చేయకపోవడం వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా సాయి గణేష్ కాలనీ రోడ్ నెంబర్ 4 లో వరద నీరు ముంచెత్తి చెరువును తలపించింది. ఇండ్లలోకి వరద నీరు ప్రవేశించడం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు ఇప్పటికైనా ప్రభుత్వ అధికారులు స్పందించి ఈ యొక్క కాలనీకి సరైన డ్రైనేజీ వ్యవస్థను, మరియు సరైన రోడ్డును నిర్మించాలని కాలనీవాసులు వేడుకుంటున్నారు.

## నాణ్యతలేని కల్తీ విత్తనాలు, ఎరువులను విక్రయిస్తే కఠిన చర్యలు

### వైద్య సిబ్బంది నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండాలి

### జిల్లా (ఇన్చార్జి) కలెక్టర్ లెనిన్ వత్సల్ టోప్పో



**కేసముద్రం, 12 ఆగష్టు (కెరటం న్యూస్):** కేసముద్రం మండల మున్సిపాలిటీ పరిధిలో మంగళవారం జిల్లా (ఇన్చార్జి) కలెక్టర్ లెనిన్ వత్సల్ టోప్పో జిల్లాలోని కేసముద్రం మండల కేంద్రంలో విస్తృతంగా పర్యటించారు, నాణ్యతలేని కల్తీ విత్తనాలు, ఎరువులను విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని, వైద్య సిబ్బంది నిత్యం ప్రజలకు అందుబాటులోఉండాలన్నారు (ఇన్చార్జి) కలెక్టర్ లెనిన్ వత్సల్ టోప్పో,రైతులకు నాణ్యత లేని కల్తీ విత్తనాలు, ఎరువులు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు మండల కేంద్రంలోని ఓలం బస్వరాజం ఎరువుల షాపులో ఆయన ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు ఎరువుల స్టాక్ వివరాల రిజిస్టర్ ను ఆన్లైన్ ద్వారా కేటాయించిన స్టాక్ వివరాలు ఎరువుల తేదీ తదితర అంశాలను ఆయన స్వయంగా పరిశీలించారు ప్రస్తుత సీజన్కు అనుగుణంగా రైతులకు ఎరువులు విత్తనాలు అందించాలని కృత్రిమ కొరత సృష్టించకూడదని ఆయన సంబంధిత డీలర్లు ఆదేశించారు ఆన్లైన్ ద్వారా మాత్రమే రైతుల వివరాలు సేకరించి ఎరువులను విత్తనాలను విక్రయించాలన్ని విక్రయించిన ఎరువులకు సంబంధించి కచ్చితంగా బిల్లులు ఇవ్వాలని ఆయన సూచించారు, షాపు ముందు ఎరువుల స్టాక్ వివరాల బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండాలని ప్రస్తుతం వానకాలం సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలని క్షేత్రస్థాయిలో సంబంధిత వైద్య సిబ్బంది ఆరోగ్య సేవలు అందించాలని, పంచాయతీ కార్యదర్శులు, మున్సిపల్ సిబ్బంది సమన్వయం తో కలిసి పని చేయాలని, సాధారణ ప్రసవాలను ప్రోత్సహించాలని, మాత శిశు మరణాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని, కేంద్రంలో తగినన్ని మందులు సిద్ధంగా ఉంచుకోవాలని, ప్రజలకు సీజనల్ అనుగుణంగా అందించే వైద్య కార్యక్రమాలను షెడ్యూల్ ప్రకారం నిర్వహించాలని సూచించారు,కేసముద్రం మున్సిపల్ పరిధిలో పెండింగ్లో ఉన్న అభివృద్ధి పనులను వెంటనే పూర్తి చేయాలని, డంపింగ్ యార్డ్, అంతర్గత పనులు పూర్తి చేయాలని సూచించారు, పట్టణ అభివృద్ధికి ప్రతి ఒక్కరి సహాయం తీసుకుని ముందుకు సాగాలని ఆయన సంబంధిత అధికారులకు సూచించారు, ఈ కార్యక్రమంలో స్థానిక తహసిల్దార్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు సిబ్బంది తదితరులు ఉన్నారు

## ప్రజా సంక్షేమం కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

### మండల పార్టీ అధ్యక్షులు కూరెల్లి సతీష్



**ఇనుగుర్తి, 12ఆగష్టు (కెరటం న్యూస్):** మహబూబాబాద్ శాసనసభ్యులు భూక్య మురళి నాయక్ ఆదేశాల మేరకు ఇనుగుర్తి మండలం చిన్న ముప్పారం గ్రామంలో ఏర్పాటు చేసిన రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమానికి మండల పార్టీ అధ్యక్షులు కూరెల్లి సతీష్ హాజరై లబ్ధిదారులకు రేషన్ కార్డులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కూరెల్లి సతీష్ మాట్లాడుతూ ప్రజా సంక్షేమం, పేద ప్రజల అభివృద్ధి కాంగ్రెస్ ప్రభుత్వం లక్ష్యం అని అన్నారు. ఈ కార్యక్రమానికి జిల్లా నాయకులు కాలేరు శివాజీ, మాజీ ఎంపీటీసీ కదిరి జగన్, మండల నాయకులు ఏర్పుల నరసింహం, పిట్టల నరేష్, సుధాకర్ రెడ్డి, గుర్రం శివ, వీరేశం ,గంగాధర్, భానోత్ వీరన్న ,బాలు , రేషన్ డీలర్ మధుసూదన్ రెడ్డి ,పార్టీ కార్యకర్తలు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## ఎల్గూర్ రంగంపేట గ్రామానికి అత్యవసర సేవలకు అంతరాయం





**సంగెం, 12ఆగష్టు (కెరటం న్యూస్):** సంగెం మండలంలోని ఎల్గూర్ రంగంపేట గ్రామానికి ఓ పక్క మత్తడి పోస్తూ ఉండటం, మరో పక్క రైల్వే ట్రాక్ అండర్ పాస్ ఉండటంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా మారాయి గ్రామానికి చెందిన ఓ వ్యక్తి కాలు జారి కింద పడటంతో మెడ భాగంలో తీవ్ర గాయం కాగా వారి కుటుంబ సభ్యులు మంచంపై పడుకోబెట్టి రైల్వే ట్రాక్ దాటించి అంబులెన్స్ లో ఆసుపత్రికి తరలించారు. ఇప్పటికైనా సంబంధిత నియోజకవర్గ ఎమ్మెల్యే, ఆర్ అండ్ బి అధికారులు స్పందించి గ్రామ ప్రజలకు శాశ్వత పరిష్కారం చూపించాలని వేడుకుంటున్నారు.

## గౌడ యువజన సంఘం మండల కమిటీ ఎన్నిక

### అధ్యక్షులు మద్దెల సుధాకర్ గౌడ్



**ఇనుగుర్తి, 12ఆగష్టు (కెరటం న్యూస్):** సర్దార్ సర్వాయి పాపన్న గౌడ యువజన సంఘం మండల కమిటీని ఇనుగుర్తి మండల కేంద్రంలో గౌడ సంఘం జిల్లా అధ్యక్షులు బండి దీపక్ గౌడ్ ఆధ్వర్యంలో మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ గౌడ యువజన సంఘం మండల కమిటీ అధ్యక్షులుగా మద్దెల సుధాకర్ గౌడ్, ఉపాధ్యక్షులుగా చిర్ర సందీప్ గౌడ్, గాడిపెల్లి రాజు గౌడ్, ప్రధాన కార్యదర్శిగా జనగాం సందీప్ గౌడ్, కోశాధికారిగా బైరు వేణు గౌడ్, గౌరవ అధ్యక్షులుగా కూటికంటి మధు గౌడ్, ఇతర సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ ఎన్నికలో గౌడ సంఘం జిల్లా నాయకులు గునిగంటి కమలాకర్ గౌడ్, చిర్రా యాకాంతం గౌడ్,గడ్డం వీరేందర్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.



## కేసముద్రంలో బాంబు స్క్వాడ్ బృందం పోలీస్ స్పెషల్ పార్టీ తనిఖీలు

### స్వాతంత్ర్య దినోత్సవ సందర్భంగా ముందస్తు తనిఖీలు



**కేసముద్రం , 12 ఆగష్టు (కెరటం న్యూస్):** మండల కేంద్రంలో జిల్లా సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ సుధీర్ రామ్నాథ్ కేకన్ ఐపీఎస్ ఆదేశాల మేరకు కేసముద్రం పోలీస్ స్టేషన్ పరిధిలో కేసముద్రం పట్టణం మరియు ఇంటికన్నె లోని రద్దీ గల ప్రదేశాలైన రైల్వే స్టేషన్, బస్ స్టేషన్ మరియు వ్యవసాయ మార్కెట్ కేసముద్రం ప్రాంతాలలో స్వాతంత్ర్య దినోత్సవ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో బాంబు స్క్వాడ్ బృందం స్పెషల్ పార్టీ మరియు కేసముద్రం ఎస్ఐ మురళీ ధర్, పిఎస్ఐ నరేష్ మరియు పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

# టిమ్ డేవిడ్ మెరుపులు వృథా.. చిత్తుగా ఓడిన ఆసీస్



స్పోర్ట్స్ న్యూస్,12 ఆగస్టు (కెరటం న్యూస్):సౌతాఫ్రికాతో రెండో టీ20లో ఆస్ట్రేలియా ఓటమి పాలైంది. పర్యాటక జట్టు చేతిలో 53 పరుగుల తేడాతో చిత్తుగా ఓడింది. సొంతగడ్డపై టీ20 ఫార్మాట్లో ఆసీస్‌కు పరుగుల పరంగా ఇది రెండో అతిపెద్ద పరాజయం కావడం గమనార్హం. సౌతాఫ్రికా యువ ఆటగాడు డెవాల్డ్ బ్రెవిస్ విధ్వంసకర సెంచరీ, బౌలర్ల సమిష్టి కృషి కారణంగా కంగారూలు స్వదేశంలో ఈ మేర ఘోర పరాభవం ఎదుర్కొన్నారు.

కాగా ఆస్ట్రేలియా సొంతగడ్డపై సౌతాఫ్రికాతో మూడు టీ20, మూడు వన్డేలు ఆడేందుకు షెడ్యూల్ ఖరారైంది. ఇందులో భాగంగా తొలుత పొట్టి సిరీస్ మొదలుకాగా.. ఆసీస్ 17 పరుగుల తేడాతో మొదటి టీ20 గెలిచింది. ఈ క్రమంలో మంగళవారం ఆసీస్- ప్రొటిస్ మధ్య డార్విన్ వేదికగా రెండో టీ20 జరిగింది.

41 బంతుల్లోనే శతకం

మరారా క్రికెట్ గ్రౌండ్‌లో టాస్ గెలిచిన ఆస్ట్రేలియా తొలుత బౌలింగ్ చేసింది. ఈ క్రమంలో బ్యాటింగ్‌కు దిగిన సౌతాఫ్రికా నిర్ణీత 20 ఓవర్లలో ఏడు వికెట్ల నష్టానికి 218 పరుగులు చేసింది. టాపార్డర్‌లో కెప్టెన్ ఐడెన్ మార్క్రమ్ (18), రియాన్ రికెల్టన్ (14).. లువాన్-డ్రి ప్రిటోరియస్ (10) విఫలమైనా.. 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' డెవాల్డ్ బ్రెవిస్ సునామీ ఇన్నింగ్స్‌తో అదరగొట్టాడు.

కేవలం 41 బంతుల్లోనే శతకం సాధించిన ఈ రైట్‌హ్యాండ్ బ్యాటర్.. మొత్తంగా 56 బంతుల్లో 12 ఫోర్లు, 8 సిక్సర్ల సాయంతో 125 పరుగులతో అజేయంగా నిలిచాడు. మిగిలిన వారిలో ట్రిస్టన్ స్టబ్స్ (22 బంతుల్లో 31) మాత్రమే రాణించాడు.

ట్రవిస్ హెడ్ ఫెయిల్..

ఆస్ట్రేలియా బౌలర్లలో గ్లెన్ మాక్స్‌వెల్, బెన్ ద్వార్షుయిస్ తలా రెండు వికెట్లు దక్కించుకోగా.. జోష్ హాజిల్‌వుడ్, ఆడం జంపా ఒక్కో వికెట్ పడగొట్టారు. అనంతరం లక్ష్య ఛేదనకు దిగిన ఆసీస్‌కు ఆదిలోనే ఎదురుదెబ్బ తగిలింది.

విధ్వంసకర వీరుడిగా పేరొందిన ఓపెనర్ ట్రవిస్ హెడ్ (5).. వన్‌డౌన్ బ్యాటర్ కామెరాన్ గ్రీన్ (9) ఇలా వచ్చి అలా వెళ్లగా.. మరో ఓపెనర్, కెప్టెన్ మిచెల్ మార్ష్ (13 బంతుల్లో 22) ఫర్వాలేదనిపించాడు.

టిమ్ డేవిడ్ మెరుపులు వృథా

ఇలాంటి క్లిష్ట పరిస్థితుల్లో టిమ్ డేవిడ్ మరోసారి తన బ్యాట్ పదును చూపించాడు. కేవలం 24 బంతుల్లోనే నాలుగు ఫోర్లు, నాలుగు సిక్సర్లు బాది 50 పరుగులు సాధించాడు. అయితే, అర్ధ శతకం పూర్తి చేసుకున్న వెంటనే టిమ్ డేవిడ్ కగిసో రబాడ బౌలింగ్‌లో వాన్ డర్ డసన్‌కు క్యాచ్ ఇచ్చి పెవిలియన్ చేరాడు.

టిమ్ డేవిడ్ అవుటైన తర్వాత ఆసీస్ బ్యాటింగ్ ఆర్డర్ వేగంగా పతనమైంది. గ్లెన్ మాక్స్‌వెల్ (16), మిచెల్ ఓవెన్ (8) పూర్తిగా విఫలమయ్యారు. వికెట్ కీపర్ బ్యాటర్ అలెక్స్ క్యారీ (18 బంతుల్లో 26) కాసేపు పోరాడగా.. మిగతా వారి నుంచి అతడికి సహకారం లభించలేదు.

చెలరేగిన మఫాకా, బాష్

ఈ క్రమంలో సౌతాఫ్రికా బౌలర్ల విజృంభణ నేపథ్యంలో ఆసీస్ 17.4 ఓవర్లలో 165 పరుగులు మాత్రమే చేసి ఆలౌట్ అయింది. ఫలితంగా 53 పరుగుల తేడాతో ఓటమి చవిచూసింది.

ఇక.. ప్రొటిస్ బౌలర్లలో క్వెనా మఫాకా, కార్బిన్ బాష్ మూడేసి వికెట్లతో చెలరేగగా.. కగిసో రబాడ, మార్క్రమ్, లుంగి ఎంగిడి, పీటర్ ఒక్కో వికెట్ దక్కించుకున్నారు. కాగా రెండో టీ20లో విజయంతో సౌతాఫ్రికా సిరీస్‌ను 1-1తో సమం చేసింది. ఇరుజట్ల మధ్య సిరీస్ విజేతను తేల్చే శనివారం (ఆగష్టు 16) నాటి మూడో మ్యాచ్‌కు కైర్న్స్ వేదిక.

# విదేశాల్లో తొలి షెడ్యూల్



మూవీ న్యూస్, 12 ఆగష్టు (కెరటం న్యూస్): ప్రభాస్.. దర్శకుడు సందీప్ రెడ్డి కలయికలో 'స్పిరిట్' పేరుతో ఓ బహుభాషా చిత్రం రూపొందనున్న సంగతి తెలిసిందే. ప్రణయ్ రెడ్డి వంగా, భూషణ్ కుమార్, క్రిషన్ కుమార్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. త్రిప్తి దిమ్రీ కథానాయిక. ఈ సినిమా సెప్టెంబరు నెలాఖరున పూజా కార్యక్రమాలతో ప్రారంభం కానుంది. అయితే తొలి షెడ్యూల్ మాత్రం విదేశాల్లో మొదలు కానుందని సమాచారం. దీనికోసం సందీప్ ఇప్పటికే మెక్సికో, ఇండోనేషియా, మలేషియా, బ్యాంకాక్ తదితర దేశాల్లో లొకేషన్లు రెక్కీ చేసి పెట్టుకున్నారు. సినిమాలోని కీలక షెడ్యూల్స్‌ను అక్కడే ప్లాన్ చేస్తున్నట్లు తెలిసింది. ప్రభాస్ నవంబరు నాటికి సెట్లోకి అడుగు పెట్టే అవకాశమున్నట్లు తెలుస్తోంది. ఆయన ఈ భారీ యాక్షన్ ఎంటర్‌టైనర్‌లో శక్తిమంతమైన పోలీసు పాత్రలో కనువిందు చేయనున్నారు. సంగీత దర్శకుడు హర్ష వర్ధన్ రామేశ్వర్ ఈ చిత్ర పాటల్ని ఇప్పటికే సిద్ధం చేసినట్లు తెలిసింది.

# ఈ పాత్ర గురించి నా మనవళ్లకు చెప్పను: నాగార్జున



మూవీ న్యూస్, 12 ఆగష్టు (కెరటం న్యూస్): అగ్ర కథానాయకుడు నాగార్జున సీరియస్ పాత్రలతోనూ ప్రేక్షకులను అలరిస్తున్నారు. ఇటీవలే కుబేరతో సక్సెస్ అందుకున్న ఆయన ఇప్పుడు 'కూలీ'లో భిన్నమైన పాత్రతో రానున్నారు. లోకేశ్ కనగరాజ్ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలో కింగ్ 'సైమన్' పాత్రలో కనిపించనున్నారు. తాజాగా తన పాత్ర గురించి ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ ఇందులో నెగెటివ్ రోల్‌లో కనిపిస్తానన్నారు. ఈ పాత్ర గురించి తన మనవళ్లకు కచ్చితంగా చెప్పాలనుకోవడం లేదని చమత్కరించారు. ఎందుకంటే ఇది అంత బ్యాడ్‌గా ఉంటుందన్నారు. ఇక రజనీకాంత్‌పై ప్రశంసలు కురిపించారు. "సూపర్‌స్టార్‌తో పని చేయడం అద్భుతమైన అనుభవం. సెట్‌లో ఆయన ఉంటే ఆ సందడే వేరుగా ఉంటుంది. తమిళంలో డైలాగుల విషయంలో సాయం చేశారు. నేను ఎంత నెగెటివ్‌రోల్‌లో కనిపించినప్పటికీ ఆయన దాన్ని సెట్‌లో అంత పాజిటివ్‌గా మార్చేశారు" అని అన్నారు.

# సిరాజ్ ఫిట్‌నెస్ చూడండి.. అతడేం తింటున్నాడో మీరూ అదే తినండి..!





స్పోర్ట్స్ న్యూస్,12 ఆగస్టు (కెరటం న్యూస్): ఇంగ్లండ్ గడ్డ మీద సంచలన ప్రదర్శనతో భారత జట్టుకు కొండంత అండలా నిలిచాడు మమ్మద్ సిరాజ్. అలుపన్నదే ఎరుగకుండా ఐదుకు ఐదు టెస్టులు ఆడిన అతడి ఫిట్‌నెస్, చురుకుదనం చూసి దిగ్గజ ఆటగాళ్లు ఔరా అని ఆశ్చర్యపోయారు. ఓవల్ టెస్టులో ఐదో రోజు మియా భాయ్ స్పెల్ చూసి అతడి బౌలింగ్‌కు ఫిదా అయిన మాజీలు చాలామందే. ఇంగ్లండ్ మాజీ సారథి డేవిడ్ గోవర్ సైతం ఐదు టెస్టుల సిరీస్‌లో సిరాజ్ జోష్‌కు, ఫిట్‌నెస్‌కు మంత్రముగ్ధుడైపోయాడు. తమ జట్టు బౌలర్లు భారత పేసర్‌ను చూసి నేర్చుకోవాల్సిన విషయాలు చాలానే ఉన్నాయని అంటున్నాడీ వెటరన్.

'సిరాజ్ ఫిట్‌నెస్ అద్భుతం. మైదానంలో అతడి ఉత్సాహం ఇసుమంతైనా తగ్గినట్టు కనిపించదు. ఇరుజట్లలో ఐదుకు ఐదు టెస్టులు ఆడిన ఏకైక పేసర్ అతడే. అందుకే అతడు ఏం తింటాడో, ఏం తాగుతాడో తెలుసుకోవాలని ఉంది. సిరాజ్ పాటించే డైట్‌ను ఇంగ్లండ్ బౌలర్లకు ఇవ్వాలనుకుంటున్నా. ఓవల్ టెస్టు నాలుగో ఇన్నింగ్స్‌లో ఈ పేస్ గన్ అలసట తెలియకుండా 30కి పైగా ఓవర్లు వేశాడు. కెప్టెన్ బంతి ఇవ్వడమే ఆలస్యం.. ఓకే అంటూ నిప్పులు చెరిగాడు. అతడిలో మ్యాచ్ గెలుపొందాలనే అసాధారణమైన కసి, పట్టుదల నేను చూశాను. ఫిట్‌నెస్ పరంగానూ సిరాజ్ అద్భుతం.

కానీ, ఇంగ్లండ్ బౌలర్లు గతకొంత కాలంగా గాయాలతో బాధపడుతూనే ఉన్నారు. కెరీర్ ఆరంభం నుంచి సిరాజ్ గాయంతో జట్టుకు దూరమయ్యాడనే వార్త నేను వినలేదు. సో.. అతడిలాంటి ఫిటెనెస్ మావాళ్లకు ఉండాలి. కాబట్టే.. సిరాజ్ డైట్‌ను మా బౌలర్లకు సూచించాలని భావిస్తున్నా' అని డేవిడ్ వెల్లడించాడు. అండర్సన్ %-% టెండూల్కర్ ట్రోఫీలో టీమిండియా ప్రధాన అస్త్రం బుమ్రా మూడు మ్యాచ్‌లే ఆడగా.. సిరాజ్ బౌలింగ్ యూనిట్‌కు నాయకత్వం వహించాడు. ఓవల్‌లో రెండో ఇన్నింగ్స్‌లో ఐదు వికెట్లు తీసి చిరస్మరణీయ విజయాన్ని అందించాడీ హైదరాబాదీ. మొత్తంగా 23 వికెట్లు తీసి తన పేస్ పవర్ చూపించాడు సిరాజ్.

సిరాజ్ డైట్ ఇదే

సిరాజ్ డైట్ గురించి అతడి సోదరుడు మహ్మద్ ఇస్లాయిల్ ఆసక్తికర విషయాలు పంచుకున్నాడు. అతడు ఏం చెప్పాడంటే%ొ?% 'మా సోదరుడు సిరాజ్ ఆహారం విషయంలో చాలా కచ్చితంగా ఉంటాడు. జంక్ ఫుడ్ అస్సలు తినడు. హైదరాబాద్‌లో ఉన్నా సరే బిర్యానీ కూడా అప్పుడప్పుడే తింటాడు. పండుగులు, ప్రత్యేక సందర్భాల్లో మాత్రమే సిరాజ్ ధమ్ బిర్యానీ రుచి చూస్తాడు. అది కూడా ఇంట్లో వండినదై ఉండాలి.

పిజ్జా, ఫాస్ట్ ఫుడ్ వంటి వాటి జోలికి వెళ్లాడు. తన శరీరాన్ని మంచి ఆకృతిలో ఉంచుకోవడానికి అవసరమైన అన్ని జాగ్రత్తలు పాటిస్తాడు సిరాజ్. డైట్, ఫిట్‌నెస్.. ఒకదానితో ఒకటి ముడిపడిన ఈ రెండిటి విషయంలో అతడు క్రమశిక్షణను తప్పడు' అని ఇస్మాయిల్ తన సోదరుడి ఫిట్‌నెస్ సీక్రెట్ వెల్లడించాడు.

# ఓటీటీలోకి వచ్చేస్తున్న వర్జిన్ బాయ్స్.. స్ట్రీమింగ్ ఎప్పటి నుండి అంటే..!




మూవీ న్యూస్, 12 ఆగష్టు (కెరటం న్యూస్): మిత్రశర్మ, గీతానంద్, శ్రీహాన్, జన్నీఫర్ ఇమ్మాన్యుల్, రోనిత్, అన్షుల ముఖ్య పాత్రలు పోషించిన చిత్రం 'వర్జిన్ బాయ్స్'. దయానంద్ గడ్డం దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రానికి రాజా దారపునేని నిర్మాత. ఈ జులై 11న సినిమా విడుదల అయింది. ఈ మూవీపై ఆసక్తి కలిగించేందుకు జోరుగా ప్రమోషన్ కార్యక్రమాలు నిర్వహించారు. హైదరాబాద్‌లో ఈ సినిమా ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌ని ఘనంగా నిర్వహించారు. అలాగే ఈ సినిమా టికెట్ కొన్న 11మందికి ఐఫోన్లు గిఫ్ట్‌గా ఇస్తామని ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో చిత్రబృందం ప్రకటించింది.

ఈ కథకు కచ్చితంగా సరిపోయే టైటిల్ 'వర్జిన్ బాయ్స్' అని, ఈ సినిమాలో ఎన్నో సర్‌ప్రైజులు ఉన్నాయని నిర్మాత రాజా దారపునేని తెలిపారు. తమ కాలేజ్ లైఫ్‌లో ఎదురైన కొన్ని సంఘటల ఆధారంగా ఈ కథ తయారు చేశామని, ఇలాంటి సినిమాలు అరుదుగా వస్తాయని దర్శకుడు తెలిపారు. దాంతో భారీ ఎక్స్‌పెక్టేషన్స్ పెంచుకున్నారు నెటిజన్స్. ఇక ఈ మూవీ ఓటీటీలో ఎప్పుడెప్పుడు వస్తుందా అని అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తుండగా, ఈ మూవీని ఆగస్ట్ 15 నుండి స్ట్రీమింగ్ చేయనున్నట్టు ప్రకటించారు. మూవీ స్ట్రీమింగ్ హక్కులని ఆహా సొంతం చేసుకోగా, 15వ తేదీ నుండి ఆన్‌లైన్‌లో స్ట్రీమ్ కానుంది.